

# గుజ్జన గూళ్లు

## చిన్నారి పాఠకులకు ప్రకృతి కథలు

విద్యా, రాజారాం శర్మ

అనువాదం : కె. సురేష్

## ఇతర కథలు:

రట్టు కాని గుట్టు

గుడ్ల రహస్యం

రకరకాల పక్షులు

గూళ్లు కట్టేవి, ఆక్రమించేవి

మా పెరడులో మల్బరీ చెట్టులో గూడు కట్టుకున్న ఎర్రముడ్డి పిగిలి పిట్టలను చూసి, “ఓయ్! మీరు అదృష్టవంతులు,” అన్నాను.

“ఎందుకు?” అడిగింది తల్లి పిగిలిపిట్ట.

“మీ గుడ్లు పొదిగాయి, వాటి గుడ్లు పొదగలేదు!”





“ఎవరివి?”

“ఎర్రజుత్తు తీతువవి.”

“ఏం, ఏమయ్యింది? అవి గుడ్లను వదిలేశాయా?”

“లేదు, లేదు. అవి గూడు వదిలిపెట్టలేదు.”

తీతువ గూడును నేను కనుగొన్నదీ, రోజూ తీతువ గుడ్లమీద కూర్చోవటాన్ని చూస్తున్నదీ పిగిలిపిట్టకు చెప్పాను. తీతువ జంటలో ఒకటి కాపలా ఉంటే రెండవది గుడ్లను పొదుగుతూ ఉంటుంది. కుక్కగానీ,

ఎవరైనా మనిషిగానీ పొరపాటున గూటి దగ్గరకు వస్తే పొదుగుతున్న పిట్ట చప్పుడు కాకుండా అక్కడినుంచి వెళ్లిపోతుంది. దాంతో గుడ్లు ఎవరి దృష్టిలోనూ పడవు. అయితే రెండు పిట్టలూ ఎప్పుడూ ఆ దగ్గరలోనే ఉంటాయి.

“అలాగయితే గుడ్లు పొదిగి పిల్లలవుతాయి,” తన పిల్లలకు మేత తేవటానికి వెళుతూ చెప్పింది పిగిలిపిట్ట.

పిగిలిపిట్ట చిన్నగా ఉండే అందమైన గూటిలో గుడ్లను పెట్టింది. సన్నటి పుల్లలతో అర్ధగోళాకారంలో ఉన్న గూడు అది. నా దోసిలిలో పట్టేటంత చిన్నగా ఉంది ఆ గూడు.





తీతువ గుడ్లమాదిరి వాటి మీద కూడా మచ్చలు, మరకలు ఉన్నాయి. అయితే ఇవి లేత గులాబి రంగులో ఉండి, మచ్చలు గోధుమ, ఎరుపు, వంకాయ రంగులో ఉన్నాయి. అయితే తీతువ గుడ్లకంటే చాలా చిన్నగా ఉండి అండాకారంలో ఉన్నాయి.

పిగిలిపిట్ట తిరిగి వచ్చేవరకు ఉండి, “నీ గుడ్లు 14 రోజుల్లో పిల్లలయ్యాయి. తీతువ గుడ్లు పెద్దవి. పెద్ద గుడ్లు పొదగటానికి ఎక్కువ రోజులు తీసుకుంటాయేమొ నాకు తెలియదు కానీ ఇప్పటికి నెల రోజులు అయ్యింది. నేను రోజులు లెక్కపెడుతున్నాను,” అని చెప్పాను.

“చివరిసారిగా నువ్వు గుడ్లను ఎప్పుడు చూశావు?” అడిగింది పిగిలిపిట్ట.

“రెండు రోజులయ్యింది. ఆ గుడ్లు పొదుగుతాయన్న ఆశ వదిలేసుకున్నాను.”

“చివరి క్షణంలో ఆశ వదులుకుంటే ఎట్లా! పరిగెత్తికెళ్లి మళ్లీ చూడు. బైనాక్యులర్స్ తీసుకెళ్లటం మరచిపోవద్దు,” సలహా ఇచ్చింది పిగిలిపిట్ట.

“సరే,” అయిష్టంగానే అన్నాను. అదీ కాకుండా బైనాక్యులర్స్ ఎందుకు ఉపయోగపడుతుందో అర్థం కాలేదు.

తీతువ నేల మీదే గూడు కడుతుంది. సహజంగా ఉండే ఒక గుంతను





అవి ఎంచుకుంటాయి లేదా చిన్న గుంత చేస్తాయి. ఆ గుంత చుట్టూ సహజంగా అనిపించేలా రాళ్లు, మట్టిగడ్డలు, గడ్డి, పుల్లలు వంటివి అమరుస్తాయి. గూటిలో నాలుగు గుడ్లు పెడతాయి. అవి కూడా చుట్టూ ఉన్న రాళ్లమాదిరే ఉంటాయి. గుడ్లు పరిసరాలతో చక్కగా కలిసిపోతాయి. బైనాక్యులర్స్ ఉన్నా, లేకపోయినా తీతువ గూటిని ఎవరైనా చూడగలిగారంటే అది అదృష్టమేనని అనుకోవాలి.

గూటి దగ్గరికి చేరుకున్న తరవాత, “అయ్యో గుడ్లు లేవే! ఎవరైనా తీసుకెళ్లారా, లేదా ఏదైనా తినేసిందా... ఒకటి కూడా లేదే!” అంటూ బిత్తరపోయి అరవసాగాను.

చిన్న బాతులాగా ఉన్న ఒక పిట్ట నావైపు ఈదుకుంటూ వస్తూ, “ఏమిటి గొడవ?” అంటూ కోపంగా అడిగింది.

“గుడ్లు పోయాయి!” నేను తటపటాయిస్తూ బదులిచ్చాను. “అవి ఇక పొదగవన్న నిర్ణయానికి వచ్చేశాను. గుడ్లు చాలా రోజులు ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు చూస్తే లేవు!”

“గుడ్లు పొదగవని ఎందుకనుకున్నావు?” నిలదీసింది ఆపిట్ట.

“నేను... పిగిలిపిట్ట గుడ్లయితే–” నా మాట మధ్యలోనే ఆగిపోయింది. ఆశ్చర్యంగా నా నోరు తెరుచుకుంది.





ఆ పిట్టని ఇప్పటిదాకా శ్రద్ధగా గమనించలేదు. ఇప్పుడు పరికించి చూసేసరికి ఆశ్చర్యానికి లోనయ్యాను.

“నీ వీపు మీద ఎవరు? నీ పిల్లా?”

“అవును. నా వీపుమీద రెండు పిల్లలు ఉన్నాయి. ఇదిగో ఇది ఇవ్వాళే పొదిగింది.”

“ఈ రోజా!”

“అదిగో మళ్లీ అరుస్తున్నావు!” కోప్పడింది పిట్ట.

“నీ పిల్లకి... ఒక్క రోజేనా! అది కళ్లు తెరిచి చూసేస్తోంది, రెక్కలు కూడా ఉన్నాయి!”

పిగిలిపిట్ట ఒక రోజు పిల్లలు ఎలా ఉంటాయొ దానికి చెప్పాను. వాటికి ఒక్క ఈక కూడా ఉండదు, మాంసం ముద్దలాగా ఉంటాయి. వాటి కళ్లు మూసుకుని ఉండి ఉబ్బెత్తుగా ఉంటాయి. నోరు తెరవటం ఒక్కటే వాటికి వచ్చు.

“నువ్వు తికమక ఎందుకు పడుతున్నావో నాకు ఇప్పుడు అర్థమయ్యింది. పిగిలిపిట్టల పిల్లల మాదిరి అన్ని పిట్టల పిల్లలు ఉంటాయనుకోకూడదు. తీతువ పిట్ట పిల్లలు పూర్తిగా తయారయ్యి పుడతాయి, మావి దాదాపుగా తయారయ్యి పుడతాయి,” అని చెబుతూ తన రెండు పిల్లలతో కలిసి





ఈదుకుంటూ వెళ్లిపోసాగింది.

ఆ పిట్ట చెప్పింది ఏమిటో నాకు అర్థం కాలేదు. చేసేది ఏమీ లేక వాటిని చూస్తూ కూర్చున్నాను, బైనాక్యులర్స్ ఇందుకు బాగా ఉపయోగపడింది.

తల్లి మీద సవారీ చేస్తున్న పిల్లలు ఉండి ఉండి నీటిలోకి జారి ఈదుతున్నాయి. అవి ఎంత తొందరగా ఈత నేర్చుకున్నాయి! తల్లికి ఏమైనా ఆహారం దొరికితే వెనక్కి తిరిగి పిల్లలకు పెట్టేది. ఒక్కోసారి ఇంకో పెద్ద పిట్ట, బహుశ నాన్నేమొ, వచ్చి పిల్లలకు ఆహారం పెట్టేది. కొన్ని

పెద్ద పిల్లలు తమ ఆహారాన్ని తామే సంపాదించుకుంటున్నాయి. కొంచెం పెద్దగా ఉండటం మినహాయించి అవి కూడా చిన్నపిల్లల లాగానే ఉన్నాయి.

‘ఈ పిట్టలు ఎన్ని ఉన్నాయి! చెరువు నిండా అవే. వాటిని ఏమంటారో,’ చెరువు ఆ చివరి నుంచి ఈ చివరి దాకా చూస్తూ నాలో నేను అనుకున్నాను.

“తీతువ!”

అరవకుండా ఉండటం నా వల్ల కాలేదు. చెరువుకి ఆ వైపున గడ్డి దిబ్బలో ఒక తీతువ కూర్చుని ఉంది. సగం తెరిచిన నోరు, భారీగా తీసే ఊపిరి





అది గుడ్లను పొదుగుతోందని తెలియ చేస్తోంది. అది ఎంతో అప్రమత్తంగా ఉంది. నేను మరొక గూడు కనుగొన్నాను.

నా ఉత్సాహానికి అంతులేదు. అక్కడ కనపడిన దృశ్యం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఒక చిన్న పిల్ల తీతువ దగ్గరికి వెళ్లి దానికింద నక్కింది. అది దాని పిల్లా? దానినే చూస్తున్నాను. కొంచెం సేపయిన తరవాత తల్లి లేచి నడవసాగింది. ఎంతో ఆత్మవిశ్వాసంతో పిల్ల దానిని అనుసరించింది.

ప్రశ్నలతో నా తల బద్దలయ్యేటట్టు ఉంది. నేను చుట్టూ కలియచూసి, "“ఓయ్! నీ పేరేమిటి? ఒక్క క్షణం ఇటు వస్తావా?” అని అడిగాను.

“నా పేరు మునుగుడు కోడి. ఏమిటి సంగతి?” దగ్గరికి వస్తూ అడిగింది అది. ఈ సారి దానితోపాటు దాని పిల్లలు లేవు.

“అది తీతువ పిల్లేనా?” గుసగుసలాడినట్లుగా అడిగాను.

“అవును,” నాలాగే గుసగుసగా బదులిచ్చింది మునుగుడు కోడి, “ఒక గుడ్డు నిన్న పొదిగింది. మిగిలినవి బహుశ ఇవ్వాళ పొదుగుతాయి. పిల్లలు తడి ఆరి లేచి నిలబడే బలం వచ్చిన తరవాత అవి తమంతటా





తాము ఆహారాన్ని సంపాదించుకోగల చోటుకి తల్లి తీతువ తీసుకెళుతుంది."

"అలాగా! అంటే... ఈ గూడు ఖాళీగా ఉంది అంటే..."

"అవునవును... రెండు రోజుల క్రితం గుడ్లు పొదిగాయి. అక్కడ చూడు, కుటుంబం అంతా అక్కడ ఉంది."

మునుగుడు కోడి చూపును అనుసరిస్తూ తీతువ పిల్లల కోసం చూడసాగాను. "నీ బైనాక్యులర్స్ ఉపయోగించి చూడు. తల్లి తీతువ తన పిల్లలన్నింటిని తన కింద పొదువుకుంది," అంటూ అరిచింది అది.

“హ్హా..హ్హా! పది కాళ్ల తీతువ!” నవ్వకుండా ఉండటం నావల్ల కాలేదు. ఇటువంటి దృశ్యం అంతకు ముందెన్నడూ చూడలేదు. కాళ్లు సగం ముడుచుకుని ఉంది తల్లి తీతువ. దాని పసుపు కాళ్లతో పాటు నాలుగు జతల బూడిద రంగు కాళ్లు ఉన్నాయి!

“తల్లి తీతువ దాని పిల్లలను అలా దాపెడుతుందా?” నేను అడిగాను.

“కాదు... పిల్లలు వెచ్చగా ఉండటానికి అలా చేస్తుంది.” మునుగుడు కోడి ఈదుకుంటూ వెళ్లిపోతూ, “తీతువ పిట్టలు పరిసరాల్లో బాగా కలిసిపోతాయి! హెచ్చరికగా అమ్మ వేసే కూత వినపడితే చాలు అవి కదలకుండా కూర్చుండిపోతాయి. జాగ్రత్తగా చూడాలి, లేకపోతే





అవి నీకు కనపడవు," అరిచి చెప్పింది.

"నువ్వేమంత అదృష్టవంతురాలివి కాదు," తిరిగి వచ్చిన తరవాత పిగిలిపిట్టతో చెప్పాను, "పిల్లలకు మేతపెట్టి అలసిపోయే పని తీతువులకి లేదు."

"హాహ్హా!" పొగరుగా నవ్వింది పిగిలిపిట్ట. "మా పిల్లలను 14 రోజులపాటు సాకితే చాలు. అప్పుడు అవి ఎగరగలిగి స్వతంత్రంగా బతుకుతాయి. ఎగరటం వచ్చిన పిల్లలకు ప్రమాదాలు తక్కువ. తీతువ పిల్లలు ఎగరటానికి నెల రోజులు తీసుకుంటాయి. అప్పటివరకు వాటి అమ్మా,నాన్నలు వాటిని తినే పక్షులు, జంతువుల నుంచి పగలు, రేయీ

కాపాడాలి. తెలియకుండా ఎవరి కాళ్ల కింద పడకుండా కూడా కాపాడాలి.”

నిట్టూర్చి, తల అడ్డంగా ఊపుతూ, “ఎవరు అదృష్టవంతులో చెప్పటం కష్టం,” అన్నాను.

అంతలో మునుగుడు కోడి చెప్పిన మాటలు గుర్తుకువచ్చి, “తీతువ పిల్లలు పూర్తిగా తయారయ్యి పుడితే నీ పిల్లల సంగతి ఏమిటి?” అడిగాను.

“పూర్తిగా తయారుకాకుండా పుడతాయి!” చెప్పింది పిగిలిపిట్ట.

***





# పిట్ట పిల్లల పరిచయం

***

దక్షిణ ఢిల్లీలోని అటవీప్రాంతంలో సంజయ్ వన్‌లో 2010 ఏప్రిల్ – జులై నెలల మధ్య పరిశీలనల ఆధారంగా రాసిన కథ.

పక్షుల, గూళ్ల వాస్తవ పరిణామాన్ని ఈ పుస్తకంలోని ఫోటోలు చూపకపోవచ్చు.



ఒక రోజు వయస్సున్న పిగిలిపిట్ట పిల్లలు



పిగిలిపిట్ట పిల్లలు - 6వ రోజు



పిగిలిపిట్ట పిల్లలు: 11వ రోజు, గూడును వదలటానికి సిద్ధంగా ఉన్నాయి.



మునుగుడు కోడి పిల్లలు



మునుగుడు కోడి పెద్ద పిల్ల



ఎర్రజుత్తు తీతువ పిల్ల : ఒక రోజు వయస్సు



ఎర్రతీతువ పిల్ల, పెద్దది

THE LONG AND SHORT OF IT published by VIDYA ONLINE is licensed under
a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 3.0 Unported License
(http://creativecommons.org/licenses/by-nc-sa/3.0/)
Permissions beyond the scope of this license may be
available at admin@vidyaonline.org

http://vidyaonline.net